క్లుప్తంగా

108లో ప్రసవం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన సోనుబాయికి శనివారం పురిటినొప్పులు రావడంతో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. ఆమెను పరిశీలించిన డాక్టర్లు ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఏంద గ్రామ సమీపంలోకి రాగానే పురిటి నొప్పులు ఎక్కువ అవడంతో 108 మెడికల్ టెక్నీషియన్ విజయ్‌కుమార్ బాధితురాలికి ధైర్యం చెప్పి పురుడు పోశాడు. జన్మించిన ఇద్దరు కవల బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని, అనంతరం ఆదిలాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

బతుకమ్మ సంబురాలు

బోథ్: మండల కేంద్రంలోని వాగ్దేవి కళాశాలలో శనివారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. రంగురంగుల, తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను పేర్చి, ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పేలా, విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడారు. సొనాల మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల కరస్పాండెంట్ ఎల్కుచి రాజశేఖర్, ప్రిన్సిపాల్ రాజనాల శ్రీనివాస్, కుమ్మరి పోశెట్టి, ముత్యం, సతీష్, కార్తీక్, ప్రసాద్, హరీశ్‌రెడ్డి, దత్తు, సురేశ్, దీప, మల్లిక పాల్గొన్నారు

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ అన్నారు. భగత్‌సింగ్ 118వ జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పెందూర్ సునీల్, కో కన్వీనర్లు, అజయ్, గణేష్, దశాంత్, తనుష్, వంశీ, కిరణ్, కిష్టు పాల్గొన్నారు

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని బొందిడి గ్రామంలో శనివారం నిర్వహించిన శ్రీ రామారావు మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. తాను చిన్ననాటి నుంచి రామారావు మహరాజ్ భక్తుడినని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలి

భీంపూర్: ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని ఆదివాసీ తుడుందెబ్బ సంఘాల ఆధ్వర్యంలో శనివారం పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న నాయకులు ఆర్‌ఐ రాందాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లంబాడాలు ఎస్టీలుగా పరిగణించడంతో ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందన్నారు.

ఆటో డ్రైవర్ మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన టేకం దాదేరావు (25) మృతి చెందాడని ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొనడంతో ఆటో డ్రైవర్ టేకం దాదేరావు గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 ద్వారా ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం వైద్యులు రిమ్స్‌కు రెఫర్ చేయగా ఆసుపత్రికి చేరుకునే లోపే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'సామాజిక వర్గం లేని చోట రిజర్వేషన్లు సరికాదు'

గుడిహత్నూర్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ వార్డుసభ్యుల రిజర్వేషన్ ఖరారుకు ఎంపీడీవో మాణిక్ ప్రభు ఆధ్వర్యంలో శనివారం లక్కీ డ్రా నిర్వహించారు. లక్కీ డ్రా నిర్వాహణకు హాజరైన ఆయా పార్టీల నాయకులు అధికారులపై మండిపడ్డారు. ఒక వార్డులో ఆ తెగకు చెందిన వారు లేకపోయినా.. రిజర్వేషను ఎలా ఖరారు చేశారని ప్రశ్నించారు. అధికారుల తప్పుడు సమాచారంతోనే రిజర్వేషన్లు తారుమారు అయ్యాయని మండిపడ్డారు. ఎక్కడైతే మెజార్టీ ఉన్న వారికి అక్కడ రిజర్వేషన్ అందించకుండా లేని చోట స్థానం కల్పించడం సరికాదన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

నేరడిగొండ: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అదనపు డీఆర్డీవో కుటుంబరావ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏడాది కాలంలో చేపట్టిన పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో వెలుగుచూసిన అక్రమాలపై రికవరీకి ఆదేశించారు. ఎంపీడీవో శేఖర్, ఏపీవో వసంత్ రావు, ఎస్సార్పీ మహేశ్, తదితరులున్నారు.

ఉప్పొంగిన వాగులు



భీంపూర్: ఉధృతంగా ప్రవహిస్తున్న టెక్షి రాంపూర్ వాగు



సిరికొండ: పొంగిపొర్లుతున్న చిక్‌మాన్ వాగు

రెండు రోజుల నుంచి మళ్లీ వర్షాలు కురవడంతో శనివారం సిరికొండ, భీంపూర్ మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగాయి. ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సిరికొండ మండలంలోని చిక్‌మాన్ వాగు ఉధృతంగా ప్రవహించింది. భీంపూర్ మండలంలో ఎగువన కురిసిన భారీ వర్షాలతో టెక్షి రాంపూర్–గుబిడి వాగు ఉప్పొంగి ప్రవహించింది. కొద్దిసేపు రాకపోకలు స్తంభించాయి. – సిరికొండ, భీంపూర్

ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

ఇచ్చోడ: మండలంలో 32 పంచాయతీల్లో వార్డులకు శనివారం ఎంపీడీవో సత్యనంద్ రిజర్వేషన్లు ఖరారు చేశారు. గత ఎన్నికలలో ఉన్న రిజర్వేషన్ల ఆధారంగా లాటరీ పద్ధతి ద్వారా ఖరారు చేసినట్లు తెలిపారు. ఇచ్చోడ మేజార్ పంచాయతీలో 16 వార్డులకు 1 వార్డు ఎస్టీ (మహిళ) 2వ వార్డు ఎస్టీ (జనరల్), 3వ వార్డు జనరల్ (మహిళ), 4వ వార్డు ఎస్టీ (మహిళ), 5వ వార్డు జనరల్ (మహిళ), 6 వ వార్డు జనరల్ (మహిళ), 7వ వార్డు జనరల్ (మహిళ), 8వ వార్డు ఎస్టీ (జనరల్), 9వ వార్డు ఎస్టీ (మహిళ), 10వ వార్డు ఎస్టీ (జనరల్), 11వ వార్డు ఎస్టీ (మహిళ) 12వ వార్డు ఎస్టీ (జనరల్), 13,14,15,16 వార్డులకు జనరల్‌కు ఖరారు చేసినట్లు తెలిపారు.

ఎంపీటీసీ స్థానాలకు..

ఇచ్చోడ: ఇచ్చోడ మండల ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. అడేగామ(కె)కు బీసీ(జనరల్), తలమద్రికి ఎస్సీ (జనరల్), ఇచ్చోడ – 1 ఎస్సీ (మహిళ), ఇచ్చోడ– 2 బీసీ (జనరల్), ఇచ్చోడ– 3 బీసీ (మహిళ), గేర్జం జనరల్, నర్సాపూర్



ఇచ్చోడ: రిజర్వేషన్లు ఖరారు చేస్తున్న ఎంపీడీవో

బీసీ (జనరల్), బోరిగామ బీసీ (మహిళ), నవేగావ్ బీసీ (మహిళ), ముఖరా(బి) ఎస్టీ (మహిళ), కేశవపట్నం ఎస్టీ (జనరల్), గుండాల జనరల్, మాన్కపూర్ జనరల్ రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎంపీపీ స్థానాన్ని బీసీ (మహిళ)కు కేటాయించగా, జెడ్పీటీసీ స్థానాన్ని బీసీ (జనరల్) కేటాయించారు.

తలమడుగు: మండలంలోని పది ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లను శనివారం అధికారులు వెల్లడించారు. మండల జెడ్పీటీసీ స్థానాన్ని ఎస్టీ మహిళ, ఎంపీపీ స్థానాన్ని ఎస్సీ మహిళకు కేటాయించారు. కుసులాపూర్ ఎంపీటీసీ ఎస్టీ మహిళ, పురుషులు, రుయ్యాడి ఎస్టీ మహిళ, బరంపూర్ ఎస్టీ మహిళ, పురుషులు, సుంకిడి ఎస్సీ మహిళ, దేవాపూర్ ఎస్సీ మహిళ, పురుషులు, కజ్జర్ల బీసీ మహిళ, పురుషులు, తలమడుగు బీసీ మహిళ, ఝరి బీసీ మహిళ, పల్లి(బి) మహిళ, పురుషులు, ఉమ్రి జనరల్ మహిళకు కేటాయించారు.

జైనథ్: మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు 144 వార్డులు ఉన్నాయి. ఇందులో 72 వార్డులు మహిళలకు రిజర్వేషన్ ఖరారు చేయడం జరిగిందని ఎంపీడీవో మహేశ్‌కుమార్ తెలిపారు. ఆయా వార్డులకు సంబంధించిన అభిప్రాయాలను వివిధ పార్టీ ముఖ్య నాయకులకు వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు లోక కరుణాకర్ రెడ్డి, గడ్డం జగదీశ్ రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని 32 గ్రామపంచాయతీల పరిధిలో 8 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వాటి రిజర్వేషన్ వివరాలు నేరడిగొండ ఎస్టీ (మహిళ), తేజాపూర్ ఎస్టీ (జనరల్), కుమారి ఎస్టీ (జనరల్), గుత్పాల బీసీ (జనరల్), లింగట్ల బీసీ (జనరల్), వాంకిడి బీసీ (మహిళ), బుగ్గారం జనరల్ (మహిళ), వడూర్ ఎస్టీ (మహిళ)కు కేటాయించారు.

ఇచ్చిన మాట నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దే

కైలాస్‌నగర్: ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు జీవోను స్వాగతిస్తూ.. శనివారం జిల్లా కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీలు సమర్థవంతంగా కొనసాగిస్తుందన్నారు. బీసీలు రాజకీయంగా రాణించేలా 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ.. జీవో జారీ చేయడం హర్షనీయమన్నారు. కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, ఓబీసీ చైర్మన్ అంబకంటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రిజర్వేషన్లు ప్రకటించిన సబ్ కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణ కోసం శనివారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ యువరాజ్ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ, సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్‌లను ప్రకటించారు. మండలంలోని 33 గ్రామపంచాయితీ సర్పంచ్ స్థానాలకు, వార్డు సభ్యులకు, ఎంపీటీసీ 18 స్థానాలకు రిజర్వేషన్లను ప్రకటించారు. గతంలో జరిగిన ఎన్నికల రిజర్వేషన్ కంటే ఈసారి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు తారుమారు కావడంతో రాజకీయ నాయకులను నిరుత్సాహానికి గురి చేసింది. సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

బోథ్: మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు నుంచి సొనాల మీదుగా మహారాష్ట్ర వైపు వెళ్లే అంతరాష్ట్ర రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతలను శనివారం కౌఠ (బి) గ్రామానికి చెందిన వివేకానంద యూత్ సభ్యులు పూడ్చారు. శనివారం స్వచ్ఛందంగా శ్రమించి, రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టారు. ప్రజలు ఇబ్బంది పడకుండా యూత్ సభ్యులు శ్రమదానం చేసి గుంతలు పూడ్చారు. వారిని వాహనదారులు అభినందించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

నేరడిగొండ: వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆయా విభాగాల వైద్య నిపుణులు మహిళలకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని డాక్టర్ ప్రవళిక, తనుశ్రీ, ఆనంద్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ సద్దాం, హెల్త్ సూపర్‌వైజర్లు సంతోష్, స్వర్ణలత, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్ సింగ్, ఫార్మసిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భీంపూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిమ్స్ ఆసుపత్రి వైద్య బృందం డాక్టర్ సాయి హారిక, అజిత్, అనిల్ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. గర్భిణులు, మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సికిల్‌సెల్, అనీమియా, క్షయ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ తెలిపారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రూహిదాస్, మేఘ, సంధ్యారాణి, మాయావతి, సాహితి, ఆరోగ్య కార్యకర్తలు లచ్చుబాయ్, సరస్వతి, సుజాత, భాగ్యవతి, జానాబాయ్, విజయలక్ష్మి, విష్ణుకుమార్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఘనంగా కుంకుమార్చన

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి మండలపాల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శనివారం కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, దుర్గామాతకు హారతి ఇచ్చారు. అనంతరం మహిళల దాడియ నృత్యం ఆకట్టుకుంది.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

చండీయాగం

బోథ్: మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయంలో శనివారం చండీయాగం నిర్వహించారు. దుర్గమ్మ ఆశీస్సులు, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ మహా క్రతువును ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. వేద పండితులు సదానంద శర్మ, గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన పూజలు చేశారు. యజ్ఞగుండంలో భక్తులు సమర్పించిన పట్టువస్త్రాలు, పండ్లు, నెయ్యి సమర్పించారు.



పాల్గొన్న దంపతులు, భక్తులు

పల్లకి ఊరేగింపు

నేరడిగొండ: మండల కేంద్రంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గామాత పల్లకిని భక్తులు ఊరేగించారు. గ్రామంలోని పురవీధుల గుండా పల్లకిని ఊరేగించగా.. యువతి యువకులు, దీక్షాపరులు నృత్యం చేశారు. భక్తులు ఘన స్వాగతం పలికి దుర్గామాతను పూజించారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ రెడ్డి, ఆల్వె శేఖర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సాలేగూడలో తాగునీటి కష్టాలు



నీటి కోసం బోరుబావి వద్ద క్యూకట్టిన ప్రజలు

- సరఫరా కాని భగీరథ నీరు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఇంద్రవెల్లి: మండలంలోని తేజాపూర్ పరిధిలోని సాలేగూడ నీటి కష్టాలు మొదలయ్యాయి. మిషన్ భగీరథ నీరు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి ఎడ్ల బండ్లు, బైక్‌లపై తాగు నీటిని తెచ్చుకుంటున్నారు. నీటి కోసం ఏ పని చేయకుండా ఇంటి వద్ద ఉంటున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సాలేగూడ గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

జైనథ్: మండలంలోని బెల్గాం గ్రామంలో బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఉప సర్పంచ్, వార్డు మెంబర్, పలువురు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల కంటే ముందే పార్టీలో చేరడం శుభ పరిణామం అన్నారు. అందరూ కలిసి కట్టుగా శ్రమించి పార్టీ విజయం కోసం కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇస్తున్నట్లు చెప్పుకోవడం హాస్యస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, అడ్డి రూకేష్ రెడ్డి, గిమ్మ సంతోష్ రావు, సింగిరెడ్డి రాం రెడ్డి, బద్దం సురేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

'పత్తి రైతులకు తీవ్ర అన్యాయం'

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం విదేశీ పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం పన్నును రద్దు చేయడంతో ఇక్కడి రైతులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ అన్నారు. కేంద్రం వైఖరికి వ్యతిరేకంగా శనివారం సీపీఎం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు సుంకాన్ని యథావిధిగా ఉంచాలని డిమాండ్ చేశారు. సుంకాలను ఎత్తివేయడంతో విదేశీ పత్తి భారతదేశానికి ఎక్కువగా వస్తుందన్నారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేయకుండా ప్రైవేట్ వారికే అప్పగించేందుకు కేంద్రం యత్నిస్తుందని ఆరోపించారు. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు, ప్రజావ్యతిరేక విధానాలను సహించేది లేదన్నారు. ఈ నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. దేశంలోని రైతులకు మేలు చేసే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లంక రాఘవులు, సచిన్, కిరణ్, ఆశన్న, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

బెల్ట్‌షాపులు మూసివేయాలి

ఇచ్చోడ: ఏజెన్సీ ప్రాంతమైన ఇచ్చోడ మండల కేంద్రంలో నడుస్తున్న బెల్ట్‌షాపులు వెంటనే మూసివేయాలని ఆదివాసీ సంఘం నాయకులు శనివారం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో మాట్లాడారు. పెసా చట్టానికి విరుద్ధంగా విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నడుస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండల కేంద్రంలో గల్లీకి ఒక్క బెల్ట్‌షాపు ఉన్నా.. ఎక్సైజ్, పోలీసు శాఖ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మేడిగూడ సార్ మేడి మెస్రం శంభు, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్, నైతం శేఖర్, కల్లె విఠల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

నేరడిగొండ: మలిదశ తెలంగాణ రాష్ట్ర పోరాటయోధుడు, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని పద్మశాలి మండల అధ్యక్షుడు ఆడెపు రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కామని ప్రభాకర్, సత్యనారాయణ, రాజేశ్వర్, శేఖర్, గంగాధర్, సాగర్ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంతో పాటు ధన్నూర్(బి) గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ధన్నూర్(బి) గ్రామంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, పరమేశ్వర్, శ్రీనివాస్, రామన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని అడిషనల్ ఎస్పీ బి. సురేందర్ రావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బాపూజీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్పీలు సీహెచ్. నాగేందర్, కమతం ఇంద్రవర్ధన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.మురళి, డి.వెంకటి, ఎస్.చంద్రశేఖర్, సులోచన, సంజీవ్ కుమార్, పాల్గొన్నారు.



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న నాయకులు



బోథ్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న నాయకులు

రిజర్వేషన్ల జాబితాపై అవగాహన అవసరం

ఇంద్రవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల జాబితాపై రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన ఉండాలని ఎంపీడీవో జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం 29 గ్రామపంచాయతీ పరిధిలోని వార్డుల వారీగా కల్పించిన రిజర్వేషన్ల జాబితా వివరాలను నాయకులకు అందించారు. ఇంద్రవెల్లి జెడ్పీటీసీ మహిళ జనరల్, ఎంపీపీ ఎస్టీ జనరల్ రావడంతో నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, నాయకులు ఆర్క ఖమ్ము, మీర్జా యాకుబ్‌బేగ్, జాదవ్ లఖన్, మస్కే రాజువర్ధన్, ఆరెల్లి రాజలింగు పాల్గొన్నారు.



రిజర్వేషన్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో, నాయకులు